

చేతి వృత్తిదారులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
- సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించుకోవాలి
- పీఎం విశ్వకర్మ పథకం ద్వారా ప్రోత్సాహం
- ఐటీడీఏ పీవో వి.అభిషేక్

8



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు

ధర్మశ్రీ నన్ను కొట్టారు

విశాఖ డెయిరీలో చర్చల కోసం వెళితే చెయ్యి చేసుకున్నారు

- వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావు ఆవేదన
- ఎమ్మెల్యే తీరుకు నిరసనగా పదవికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో ధర్మశ్రీకి టికెట్ ఇస్తే మద్దతు ఇవ్వబోమని విస్పష్టం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 28: చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తనను దుర్భాషలా డడమే కాకుండా తనపై చేయి చేసుకున్నారని మండలం లోని వడ్డాది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం వడ్డా దిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వడ్డాది మేజర్ పంచాయతీలో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌ను పక్కనపెట్టి, పంచాయతీ పాలకవర్గంతో సంబంధంలేని వైసీపీ గ్రామ అధ్య క్షుడు దొండా నారాయణమూర్తికి అధికారాలను ఎమ్మెల్యే అప్పగించారని విమర్శించారు. అప్పటి నుంచి పంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు, వంటి వాటిలో అవినీతి జరుగుతున్నదని, దీనివల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తున్నదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. దీంతో ఇటీవల మీడియా సమా వేశం ఏర్పాటు చేసి, తమ ఆవేదనను వ్యక్తం చేశామని చెప్పారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో విశాఖ రావా లని చైర్మన్ ఆనంద్ తమకు కబురుపెట్టారని తెలిపారు. ఆదివారం విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో మంత్రి అమర్‌నాథ్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో ఎమ్మెల్యే ధర్మశ్రీతో రాజీ సమావేశాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ధర్మశ్రీ వ్యవహార శైలిపై పలువురు ... మిగతా 8వ పేజీలో

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

- అరకు కాఫీని దేశ, విదేశాల్లో ప్రమోట్ చేసింది ఆయనే
- గిరిజనులకు విదేశీ విద్యను తీసుకువచ్చారు
- చంద్రబాబు అమలు చేసిన గిరిజన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది
- పాడేరు మండలం ఆడారిమెట్ట సభలో నారా భువనేశ్వరి





పాడేరు మండలం ఆడారిమెట్టలో జరిగిన సమావేశంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని ఆయన సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. మండలంలోని చింతలవీధి పంచాయతీ ఆడారి మెట్టలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అధ్యక్షతన గిరిజన మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధే చంద్రబాబు ధ్యేయమని, ఈ ప్రాంతాలపై ఆయనకు ఎనలేని ప్రేమాభిమానాలు ఉన్నాయన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని దూర దృష్టితో చంద్రబాబు అనేక పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. గిరిజనులు విదేశాల్లో చదువుకునేందుకు ఎన్‌టీఆర్ విదేశీ విద్యోన్నతి పథకాన్ని అమలు చేశారని ఆమె గుర్తు చేశారు.



ఆడారిమెట్టలో థింసా కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న భువనేశ్వరి

గిరిజన గర్భిణులు, బాలింతలకు గిరి గోరుముద్ద, చిన్నారులకు బాలామృతం, పుట్టిన బిడ్డలకు బేబీ కిట్‌ల పథకాలను అమలు చేశారన్నారు. అలాగే ప్రసవించిన అనంతరం తల్లీబిడ్డలను ఇంటికి సురక్షితంగా పంపేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అంబులెన్సులను, మారుమూల ప్రాంతాల్లో రోగుల కోసం ఫీడర్ అంబులెన్సులను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజన బిడ్డల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం అమలు చేశారన్నారు. జగన్ సీఎం అయ్యాక గిరిజనుల కోసం ఉన్న ఈ పథకాలన్నీ రద్దు చేశారన్నారు.

అరకు కాఫీని చంద్రబాబు బాగా ప్రమోట్ చేశారు

అరకు ప్రాంత ప్రాధాన్యతను, అరకు కాఫీని చంద్రబాబు దేశ, విదేశాల్లో బాగా ప్రమోట్ చేశారన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి చంద్రబాబు ఎంత కష్టపడ్డారో అందరికీ తెలుసునన్నారు. బుధవారం ఉదయం ఆయన ఫోన్ చేసి దాదాపు పావు గంట సేపు అరకులోయ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, అరకు కాఫీ గురించి వివరించారని చెప్పారు. అరకు కాఫీ రుచి చూడాలని చంద్రబాబు సూచించారన్నారు. తెలుగుదేశం పాలనలో ఎంతో అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతాలు, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి పాలనలో సరైన రోడ్డులేని దుస్థితికి చేరాయన్నారు. అరకు కాఫీకి చంద్రబాబు ఇచ్చిన ప్రోత్సాహం ఎవరూ ఇవ్వలేదని, ప్రధాని మోదీతో సైతం అరకు కాఫీని తాగించారన్నారు. కానీ వైసీపీ అరకు కాఫీ అభివృద్ధికి ఏమీ చేయడం లేదని భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. అరకు ప్రాంతంలో పంటలకు గిట్టుబాటు ధర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. కుటుంబాన్ని, సన్నిహితుల్ని సైతం పక్కన పెట్టి గిరిజన ప్రాంతం కోసం చంద్రబాబు కృషి చేశారన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్టు చేసిన సమయంలో గిరిజన ప్రాంతంలో సైతం అందరూ తల్లడిల్లారని, ఆయన అరెస్టుకు నిరసనగా శాంతియుతంగా ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు చేశారని, తమకు అండగా నిలిచారని ... మిగతా 8వ పేజీలో



ముసిరిగుడ గ్రామంలో సొనాయి బసు భార్య కాసులమ్మను పరామర్శిస్తున్న భువనేశ్వరి

ప్రజలతో మమేకం

- ముసిరిగుడ గ్రామంలో నారా భువనేశ్వరి పర్యటన
- మృతుని కుటుంబానికి పరామర్శ
- పార్టీ అండగా ఉంటుందని ఓదార్పు
- గ్రామంలోని మహిళలకు ఆత్మీయ పలకరింపు

అరకులోయ, ఫిబ్రవరి 28: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి బుధవారం ఉదయం మండలంలోని మాదల పంచాయతీ ముసిరిగుడ గ్రామంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన పార్టీ కార్యకర్త సొనాయి బసు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. బసు చిత్రపటం వద్ద నివాళులర్పించి, అతని భార్య కాసులమ్మను ఓదార్చారు. పార్టీ ... మిగతా 8వ పేజీలో



పొలం గట్లు దాటుకుని బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న చినఅగ్రహారం మహిళలు

తాగునీటి కష్టాలు తీరేదెన్నడో?

- మూలకు చేరిన గ్రావిటీ నీటి పథకం
- రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తామని గత ఎన్నికల సమయంలో వైసీపీ నేతల హామీ
- ఐదేళ్లయినా పట్టించుకోని వైనం
- 1.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవలసిన దుస్థితి
- గిరిజన మహిళలకు తప్పని అవస్థలు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 28: మండలంలోని జీకేవీధి పంచాయతీ చినఅగ్రహారం ఆదివాసీలు తాగునీటికి అల్లాడిపోతున్నారు. మంచినీటి పథకం అందుబాటు లో లేకపోవడంతో గ్రామానికి దూరంగా ఉన్న ఊటగెడ్డకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. దీని వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. గత ఎన్నికల సమయంలో రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తామని వైసీపీ నాయకులు హామీ ఇచ్చి మరిచారని వారు వాపోతున్నారు.

జీకేవీధి పంచాయతీ చినఅగ్రహారం గ్రామంలో సుమారు 70 ఆదివాసీ కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామంలో సుమారు ఏడేళ్ల కిందట పంచాయతీ అధికారులు నిర్మించిన గ్రావిటీ పథకం మరమ్మతులకు గురైంది. పంచాయతీల వద్ద నిధులు లేకపోవడం వల్ల గ్రావిటీ పథకం మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల ప్రస్తుతం పూర్తిగా శిథిలమైపోయింది. ఇప్పుడు ఈ గ్రావిటీ పథకం వినియోగంలో లేదు. గత ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ఈ గ్రామాన్ని సందర్శించి తాము అధికారంలోకి వస్తే రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తాజాగా ఏడాదిన్నర కిందట గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి ఆదివాసీలు తమ సమస్యలను తీసుకువచ్చారు. మంచినీటి పథకాన్ని నిర్మిస్తామని ఆమె కూడా హామీ ఇచ్చారు. ఆ తరువాత ఈ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆదివాసీ మహిళలు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డకు ... మిగతా 8వ పేజీలో



ఊటగెడ్డ నుంచి నీళ్లను తోడుకుంటున్న గిరిజన మహిళ

చాలా ఇబ్బంది పడుతున్నాం



మంచినీళ్ల కోసం చాలా ఇబ్బంది పడుతున్నాం. గ్రామం నుంచి 1.5 కిలోమీటర్లు నడిచి వచ్చి నీళ్ల బిందెలను మోసుకుని ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. నీళ్ల కోసం ఉదయం మూడు సార్లు, సాయంత్రం రెండు సార్లు ఊటగెడ్డకు వస్తున్నాం. వర్షాకాలం పొలాల గట్లపై నిండు బిందెలతో నడిచి వెళ్లడం కష్టంగా ఉంటుంది. కొంత మంది మహిళలు పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-వంతల దసుథ, చినఅగ్రహారం



పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావు

సీలేరు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు

ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావు

సీలేరు, ఫిబ్రవరి 28: సీలేరు పంప్డ్ స్టోరేజి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్మించే పార్వతీనగర్, శాండికొరి, జొన్నమామిడి గ్రామాలను ఆయన సందర్శించారు. జొన్నమామిడి వద్ద నిర్మించతలపెట్టిన పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు కోసం తాజాగా అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు సందర్శించి అటవీ అనుమతులు మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ మేరకు ప్రస్తుతం ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్మాణంపై అధికారులతో ... మిగతా 8వ పేజీలో

ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,

9985411639

ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.

9985411029

దట్టంగా పొగమంచు

ఏజెన్సీలో స్థిరంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. పాడేరు, పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు దట్టంగా కమ్ముకున్నది. జి.మాడుగులలో 12.8, ముంచంగిపుట్టులో 14.9, పెదబయలులో 15.4, అరకులోయలో 15.6, అనంతగిరిలో 15.7, పాడేరులో 15.8, డుంబ్రిగుడలో 16.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. మన్యంలో కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు కురిసింది. పగటి వేళలో ఎండ ప్రభావం కనిపించింది.



చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్‌లో మంచు



పాడేరు- చింతపల్లి మార్గంలో బుధవారం ఉదయం పొగమంచు

చింతపల్లిలో..

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో చలి కాస్త తగ్గుముఖం పట్టింది. రాత్రి వేళ మినహా పగటి పూట పెద్దగా చలి లేదు. బుధవారం చింతపల్లిలో 17.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. రానున్న రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట: మండలంలో పొగమంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు వీడలేదు. పాడేరు-అరకు ప్రధాన రోడ్డులో మంచు ఎక్కువ కురవడంతో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి.

చెరువులవేనం సోయగం.. మనోహరం

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలో ఉన్న చెరువులవేనం ప్రకృతి అందాలు సీజన్ ఆఖరిలోనూ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఓ వైపు శీతాకాల సీజన్ ముగుస్తుండడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో మరో వారం, పది రోజుల్లో చెరువులవేనంలో ప్రకృతి అందాలు కనుమరుగు కానున్నాయి. ఈ తరుణంలో నాలుగు రోజులుగా చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద రమణీయమైన మంచు అందాలు ఆవిష్కృతమవుతున్నాయి. పచ్చని అడవులను తాకుతూ పయనిస్తున్న మంచు మేఘాలు వీక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఈ ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు క్యూకడుతున్నారు. బుధవారం ఆవిష్కృతమైన మంచు సోయగాలు సందర్శకులను కనువిందు చేశాయి.

-చింతపల్లి



చెరువులవేనం మంచు అందాలు

క్రైం... crime news

బైక్ అదుపుతప్పి.. యువకుడి మృతి


సన్యాసిరావు (ఫైల్)

నక్కపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని గొడిచెర్ల హైవే జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి 11 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు నక్కపల్లి హెచ్‌సీ కిశోర్ బుధవారం చెప్పారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లి గాంధీనగర్‌కు చెందిన సన్నిధి సన్యాసిరావు(32) ప్రైవేట్ ల్యాబ్‌లో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. బైక్‌పై కాకినాడ వెళుతుండగా ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

శారదా నదిలో మునిగి వృద్ధుడి మృతి

చోడవరం, ఫిబ్రవరి 28: మండలంలోని గవరవరం గ్రామం వద్ద శారదా నదిలో ప్రమాదవశాత్తూ మునిగిపోయిఇ వృద్ధుడు మృతిచెందాడు. గవరవరం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మార్టూరు దేముళ్లు (60) మంగళవారం సాయంత్రం పొలానికి వెళ్లాడు. చీకటి పడిన తరువాత ఇంటికి తిరికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గాలించారు. అయినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం మధ్యాహ్నం శారదా నదిలో ఇసుక తవ్విన గొయ్యి వద్ద దేముళ్లు మృతదేహం కనిపించింది. శారదా నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, దీనివల్ల ఏర్పడి గోతుల్లో పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేముళ్లు మృతికి కూడా ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన గొయ్యే కారణమని అన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 28: మండలంలోని దుగ్గాడ గ్రామానికి ఒక యువతి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని రూరల్ అదనపు ఎస్ఐ రామారావు తెలిపారు. దుగ్గాడ గ్రామానికి చెందిన నల్లబెల్లి అపర్ణ(19) డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 26వ తేదీన పరీక్ష రాయడానికి నర్సీపట్నం వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. మరుసటి రోజు కూడా ఆచూకీ లేకపోవడంతో యువతి తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అదనపు ఎస్ఐ తెలిపారు.

ఎలమంచిలి ఎన్టీఆర్ కాలనీలో చోరీ

- 4 తులాల బంగారు, అర కిలో వెండి అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, పోలీసులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. నాలుగు తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి సామగ్రి అపహరణకు గురైంది. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎస్.రంగనాయకులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 23న ఊరు వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారం, వెండి అపహరణకు గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ బృందం ఆధారాలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 28: నునపర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి రాజేశ్ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా బుధవారం రాత్రి పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

బాలికను కొట్టారని ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28: పట్టణంలోని కొత్తపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కొత్తపేట ఉన్నత పాఠశాలలో ఈ నెల 24న ఐదో తరగతి విద్యార్థిని అల్లరి చేస్తుండడంతో ఉపాధ్యాయుడు ఆ బాలికను కర్రతో కొట్టినట్టు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

రైల్వే జోన్ భూములపై బీజేపీ, వైసీపీ నాటకాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: విశాఖ రైల్వే జోన్‌కు భూముల కేటాయింపుపై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో ఆరోపించారు. భూములు ఇచ్చినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా, బీజేపీ ఇవ్వలేదని ప్రకటించడం చూస్తుంటే ప్రజలను గందరగోళంలో పడేసి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. విభజన చట్టంలోని హామీల్లో ఒక్కటి కూడా మోదీ ప్రభుత్వం అమలు చేయలేదని పేర్కొన్నారు. అమలు చేయని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఒత్తిడి చేయడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న ఎన్నికల్లో గెలవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అన్యాయానికి గురవుతున్న రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

2,65,886 మందికి రైతు భరోసా


నమూనా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, విప్ ధర్మశ్రీ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 2,65,886 మంది రైతులకు రూ.53 కోట్ల 32 లక్షలు జమ చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీలో 36,643 మంది రైతులకు రూ.6 కోట్ల 90 లక్షల 36 వేలు జమ చేశామన్నారు. అంతకు ముందు తాడేపల్లి నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులు అడ్డగింత


బుచ్చిరాజుపేటలో పనులను అడ్డుకుంటున్న కారిడార్ నిర్వాసిత రైతులు

నక్కపల్లి, ఫిబ్రవరి 28: విశాఖ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన తమకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ ఇచ్చే వరకు ఎటువంటి పనులు చేపట్టకూడదని కారిడార్ నిర్వాసిత రైతులు పునరుద్ఘాటించారు. బుధవారం కారిడార్ భూముల్లో యంత్రాలతో తుప్పలను తొలగించే పనులు చేపడుతుండగా ఈ గ్రామ నిర్వాసిత రైతులు పనులను అడ్డగించారు. సర్పంచ్ కాళ్ల శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు నేతృత్వంలో నిర్వాసిత రైతులు ఆందోళన చేపట్టారు. 18 ఏళ్లు నిండిన నిర్వాసిత రైతులందరికీ ఒక్కొక్కరికీ రూ.15 లక్షలు, ఇళ్లు కోల్పోతున్న వారికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాబ్జీ, ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి సీజీఎఫ్ నిధులు రూ.కోటి మంజూరు

- చైర్మన్ మురళీకృష్ణ


జీవో కాపీతో మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన పాలక మండలి సభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో శిథిలావస్థలో ఉన్న క్యూ కాంప్లెక్స్, మండపం పునర్నిర్మాణానికి దేవదాయశాఖ సీజీఎఫ్ నిధులు కింద కోటి రూపాయలు మంజూరు చేసిందని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్‌లు తెలిపారు. నిధులు మంజూరైన జీవోతో బుధవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పాలకమండలి సభ్యులు కలిశారు. సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కోరగా ఆయన స్పందించి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ ఎస్. సత్యనారాయణలకు సిఫారసు చేయగా వారు స్పందించారన్నారు. మ్యాచింగ్ గ్రాంటు రూ.60 లక్షలు జోడించి రూ.కోటి 60 లక్షలు అంచనాల నిధులను మంజూరు చేశారని చెప్పారు. నూకాంబిక ఆలయానికి సంబంధించి గతంలో సీజీఎఫ్ నిధులు ద్వారా మొట్ట మొదటిసారిగా అధిక మొత్తంలో మ్యాచింగ్ గ్రాంటు రూ.60 లక్షలు మినహాయించి కోటి రూపాయలు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే వీటి నిర్మాణ పనులకు అనుమతులు తీసుకుని టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రత్నంపేటలో కార్డన్ సెర్చ్

- ఇళ్లు, ఖాళీ స్థలాలతోపాటు పశువులశాలల్లోనూ తనిఖీలు
- రికార్డులు లేని ఒక కారు, మూడు ఆటోలు, 16 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- 2,300 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం


కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

రోలుగుంట, ఫిబ్రవరి 28: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అన్ని మండలాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు పేర్కొన్నారు. మండలంలోని రత్నంపేట గ్రామంలో బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు డీఎస్పీ పర్యవేక్షణలో నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 100 మందికిపైగా పోలీసు కానిస్టేబుళ్లతో కార్డర్ సెర్చ్ (విస్తృత తనిఖీలు) నిర్వహించారు. ఈ సమయంలో గ్రామంలో నుంచి ఎవరినీ బయటకు వెళ్లనివ్వలేదు. అదే విధంగా బయట నుంచి ఎవరినీ గ్రామంలోకి రానివ్వలేదు. ఇళ్లు, ఖాళీ స్థలాలు, పశువులశాలలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులు లేని ఒక కారు, మూడు ఆటోలు, 16 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఒక వ్యక్తి నుంచి ఐదు లీటర్ల సారాను, గ్రామ శివారున సారా తయారీకి సిద్ధం చేసిన 2,300 లీటర్ల బెల్లం పులుసును స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని దేవరాపల్లిలో ఇప్పటికే కార్డన్ సెర్చ్ నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సురేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: అనకాపల్లిలో మార్చి ఏడో తేదీన నిర్వహించనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. పిసినికాడ సమీపంలోని కొంత స్థలాన్ని, డీమార్టు సమీపంలోని మరొక స్థలాన్ని మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిశీలించారు. అలాగే హెలిప్యాడ్ కోసం ఎన్టీఆర్ స్టేడియం, కశింకోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణను పరిశీలించారు. ముఖ్యమంత్రి నిర్వహించనున్న రోడ్డు షోకు అనువైన మార్గాన్ని కూడా పరిశీలించారు. దీనిపై గురువారం తుది నిర్ణయం తీసుకోనున్నట్టు మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహణ



ఎన్నికల శిక్షణకు హాజరైన వివిధ శాఖల అధికారులు, మాట్లాడుతున్న పి.జయంతి

- జిల్లా ఎన్నికల శిక్షకులు పి.జయంతి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు నిబద్ధత, సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల శిక్షకులు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ పి.జయంతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లాలోని అధికారులకు నిర్వహించిన శిక్షణా తరగతులలో ఆమె మాట్లాడారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా పనిచేయాలన్నారు. వారికి కేటాయించిన విధుల గురించి క్షుణ్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పగించిన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో కలకలం

- జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట వార్డు సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం
- దళితుడినైన తన పట్ల కమిషనర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- ఎడమచేతి మణికట్టు వద్ద బ్లేడ్‌తో కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం
- అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలింపు


ఆత్మహత్యా యత్నం చేసిన శివ ఆదిమూర్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం రాత్రి వార్డు సచివాలయ ఉద్యోగి ఒకరు చేతి మణికట్టును బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తన పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ పది నెలలుగా సస్పెన్షన్‌లో ఉంచి ఉద్యోగం నుంచి తొలగించాలని యత్నిస్తున్నందునే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్టు సదరు ఉద్యోగి కావటి శివ ఆదిమూర్తి ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ 45వ వార్డు పరిధిలో 253 సచివాలయంలో శివ ఆదిమూర్తి వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా పనిచేసేవారు. వార్డు శానిటేషన్ సెక్రటరీగా ఉద్యోగంలో చేరిన తమతో మురుగునీటి కాలువల్లో పూడికలు తీయిస్తున్నారంటూ ఆందోళన చేయడంతో మూడేళ్ల కిందట ఆయన్ను సస్పెండ్ చేశారు. తర్వాత సస్పెన్షన్ ఎత్తేయడంతో తిరిగి ఉద్యోగంలోకి చేరారు. యూజర్ చార్జీలు వసూలు కోసం శానిటేషన్ సెక్రటరీలపై ఒత్తిడి పెంచుతున్నారని, దీన్ని తాము తట్టుకోలేకపోతున్నామంటూ శానిటేషన్ సెక్రటరీలంతా పది నెలల కిందట జీవీఎంసీ కమిషనర్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఆ సమయంలో శివ ఆదిమూర్తిని కమిషనర్ సాయికాంత్‌వర్మ సస్పెండ్ చేశారు. తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయాలని కమిషనర్‌తోపాటు సీడీఎంఏ, వార్డు సచివాలయం శాఖ డైరెక్టర్‌ను కలిసినప్పటికీ ఫలితం లేకపోగా, ఆయన్ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనిపై కమిషనర్‌ను కలిసేందుకు పలుమార్లు యత్నించినా సాధ్యంకాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కమిషనర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని కోరాలని, లేనిపక్షంలో అక్కడే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో రెండు బ్లేడ్‌లు జేబులో పెట్టుకుని జీవీఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లారు. అప్పటికే కమిషనర్‌తోపాటు ఇతర అధికారులు కూడా వెళ్లిపోవడంతో పోర్టికో వద్దకు వెళ్లి నేలపై పడుకుని తాను వెంట తీసుకువెళ్లిన బ్లేడ్‌తో ఎడమ చేతి మణికట్టు కోసుకున్నారు. విషయం దూరం నుంచి గమనించిన సెక్యూరిటీ సిబ్బంది పరుగున వచ్చి 'ఏం చేస్తున్నావంటూ' ప్రశ్నించగా తన ఆవేదన వెళ్లగక్కుతూ దళితుడినైన తన పట్ల కమిషనర్ సాయికాంత్‌వర్మ నిరంకుశంగా వ్యవహరిస్తుండడం వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని గట్టిగా అరవడం ప్రారంభించారు. సెక్యూరిటీ సిబ్బంది అవుట్ గేట్ వద్దకు తీసుకువెళ్లగా అక్కడ రోడ్డుపై పడుకుండిపోయారు. దీంతో కొంతమంది వచ్చి శివ ఆదిమూర్తిని వీడియో తీస్తూ ఆత్మహత్యకు కారణాలు ఏమిటని అడగడం ప్రారంభించారు. కొందరు 108కి ఫోన్ చేయడంతో అంబులెన్స్ వచ్చి కేజీహెచ్‌కు తీసుకువెళ్లింది.

నూకాంబిక భక్తుల మాలధారణ ప్రారంభం


మాలధారణ చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏప్రిల్ నెలలో జరగనున్న సందర్భంగా భక్తులు మాలధారణ చేయడం ప్రారంభించారు. బుధవారం నూకాంబిక అమ్మవారి మాలధారణ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ ఆవరణలోని పొంగల్ షెడ్డులో ఆలయం సెట్ ఏర్పాటు చేసి గురుస్వామి పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర కాయకల్ప బృందం


వైద్యాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర కాయకల్ప బృందం సభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని బుధవారం కాయకల్ప రాష్ట్ర బృంద సభ్యులు డాక్టర్ శ్రీనివాసవర్మ, రూపస్‌పాల్‌లు తనిఖీ చేశారు. వైద్యాలయంలో రోగులకు అందుతున్న సేవలు, శానిటేషన్, పరిశుభ్రత, ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. అలాగే అన్ని విభాగాలను వారు తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ బాగుందని బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో బృందం వెంట నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.కేజియా, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

22 గంజాయి వాహనాలు వేలం

- రాష్ట్రంలో ఇదే తొలిసారి
- ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి


గంజాయి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్న ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి, ఇతర అధికారులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 28: గంజాయి కేసుల్లో సీజ్ చేసిన 22 వాహనాలకు నర్సీపట్నం ఎస్ఈబీ కార్యాలయం వద్ద బుధవారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్, డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, గంజాయి రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం వేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారి అని చెప్పారు. 2022లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చి గెజిట్ ప్రకారం కోర్టు అనుమతితో డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయి కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలకు వేలంపాట నిర్వహించామన్నారు. మొత్తం 22 వాహనాలను వేలం వేయగా వీటిలో తొమ్మిది వాహనాలు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పట్టుబడినవని తెలిపారు. వేలంపాట ద్వారా రూ.7,14,300, జీఎస్టీ 1,33,614 కలిపి రూ.8,75,914లు ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు. ఆయా గంజాయి కేసులు కొలిక్కి వరకు వేలంపాట ద్వారా వచ్చిన సొమ్మును డీడీ రూపంలో కోర్టు ఆధీనంలో ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, పాడేరు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు జైసింహచౌదరి, ఎస్.శ్రీనివాసరావు, నర్సీపట్నం సెబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

3న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28: విశాఖపట్నం జీవీఎంసీ ఎదుట మహాత్ముని విగ్రహం వద్ద మార్చి మూడో తేదీన జరిగే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జనను విజయవంతం చేయాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, సీహెచ్. శివాజీ పాల్గొన్నారు.

AJC CLASSIFIEDS

FLAT FOR SALE

★ 3BHK, 1900 Sft. సింహాచలం, గోశాల, సింహపురి కోలనీ Ph.2 లో 60ft. రోడ్డు, N/F, ఒక ఫ్లోర్‌కి ఒక Flat, 5 Floors, లిఫ్ట్, కార్ పార్కింగ్, జనరేటర్. Ready to occupy. సెల్ : 9348123789.
AJV_183225

CHANGE OF NAME

★ I, CHETLA SATYANARYANA (Old Name), S/o. Chetla Subba Rao, resident of D.No.2-44, Jambavulapeta, Allavaram, Dr.B.R. Ambedkar Konaseema. Change my name from CHETLA SATYANARYANA (Old Name) to CHETLA SATYANARAYANA (New Name) hence forth I am being called as CHETLA SATYANARAYANA (New Name), S/o. Chetla Subba Rao, for all purposes.
AJV_182757

CHANGE OF NAME

★ I, VUDATHA SRILAKSHMI (Old Name), W/o. Vudatha Venkata Amapoomeswara Rao, resident of D.No.8-14-6, P.No.A-G-3, Lakshmi Niwas, PR Res, Thotapalem, Vizianagaram. Change my name from VUDATHA SRILAKSHMI (Old Name) to VUDATHU SRILAKSHMI (New Name) hence forth I am being called as VUDATHU SRILAKSHMI (New Name), W/o. Vudatha Venkata Amapoomeswara Rao, for all purposes.
AJV_182758

CHANGE OF NAME

★ I, KHATIJULN KHANDA (Old Name), W/o. Moshin Mohammed Mansur, resident of D.No.3-1/3-6, Arakala gedda street, Vizianagaram. Change my name from KHATIJULN KHANDA (Old Name) to KHATIJULEIN MOSHIN MOHAMMED (New Name) hence forth I am being called as KHATIJULEIN MOSHIN MOHAMMED (New Name), W/o. Moshin Mohammed Mansur, for all purposes.
AJV_182759

CHANGE OF NAME

★ I, MOHAMMED MOSHIN (Old Name), S/o. Haji Mansur, resident of D.No.3-1/3-6, Arakala gedda street, Vizianagaram. Change my name from MOHAMMED MOSHIN (Old Name) to MOSHIN MOHAMMED MANSUR (New Name) hence forth I am being called as MOSHIN MOHAMMED MANSUR (New Name), S/o. Haji Mansur, for all purposes.
AJV_182760

CHANGE OF NAME

★ I, YASMEEN KHANDA (Old Name), W/o. Arif Issa Khanda, resident of D.No.5-2-6, Sarafa, Killa Road, Nanded, Maharashtra. Change my name from YASMEEN KHANDA (Old Name) to YASMIN ARIF KHANDA (New Name) hence forth I am being called as YASMIN ARIF KHANDA (New Name), W/o. Arif Issa Khanda, for all purposes.
AJV_182761

DISTANCE EDUCATION

★ Failed / Discontinued Students can complete degree in fast track. Online B.A., B.Com., B.B.A., B.Sc., M.A., M.Com., MBA, MCA admissions in AU, Nagarjuna and KL univesities. Ph: 7997296796
AJV_183220

LOST OF PASSPORT

★ INDALA RAVITEJA, S/o. Indala Ramana, Residing at D.No.1-36, Kalapaka, Paravada Mandal, Visakhapatnam (U) - 531021. Lost my original Passport No. R-7874985 dated 18-02-2024. While I am travelling by bike from my house to Paravada Junction. If anyone found may please Contact : 9392055516.
AJV_182763

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14152

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి [illegible]
మేనేజర్ - ఏడీవీటీ

For Advertisement Contact :
9963231176
9966165093


చాపరాయిలో టీడీపీ నాయకులతో నారా భువనేశ్వరి

చాపరాయిని సందర్శించిన భువనేశ్వరి

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 28: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం అరకులోయ నుంచి పాడేరు వెళ్తున్న నారా భువనేశ్వరి మండలంలోని చాపరాయి జలపాతాన్ని సందర్శించారు. కొంతసేపు జలపాతాన్ని తిలకించారు. అనంతరం కార్యకర్తలతో ముచ్చటించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపడితే పర్యాటక ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. చాపరాయి సందర్శించిన ఆమెకు పోతంగి ఎంపీటీసీ సభ్యులు గీత స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బరావు, మాజీ ఎంపీపీ ధన్నెరావు, టీఎన్‌టీయూసీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు సింహాద్రి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్-3 పునరుద్ధరించాలని యువకుల వినతి


భువనేశ్వరికి సమస్య తెలుపుతున్న యువకులు

హుకుంపేట: జీవో నంబర్-3 పునరుద్ధరించాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి స్థానిక యువకులు వినతిపత్రం అందజేశారు. ఒంటిపాక గ్రామానికి చెందిన గిరిజన యువకులు మూడు రోజులుగా జీవో నంబర్-3 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ దీక్షా శిబిరాన్ని భువనేశ్వరి సందర్శించి మద్దతు తెలిపారు. దీక్ష చేస్తున్న యువకులు భువనేశ్వరికి వినతిపత్రం అందించి సమస్యలు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేక జీవో-3 ద్వారా అనేక ఉద్యోగాలు కల్పించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తులసీరావు, నాయకులు లక్ష్మణుడు, సూర్యకాంతం, శంకర్, పాండురంగస్వామి పాల్గొన్నారు.

భువనేశ్వరి దృష్టికి ముంచంగిపుట్టు సమస్యలు

ముంచంగిపుట్టు: మండల పరిధిలోని సమస్యలను నారా భువనేశ్వరి దృష్టికి తీసుకువెళ్లినట్టు పార్టీ నాయకులు తెలిపారు. అరకులో బుధవారం జరిగిన నిజం గెలవాలి కార్యక్రమానికి హాజరైన భువనేశ్వరిని ఆ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 23 పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను లిఖితపూర్వకంగా అందించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం, దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి, అరకు పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, కార్యనిర్వహణ కార్యదర్శి పి.కామేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడు మజ్జి చిన్ని పాల్గొన్నారు.

1.73 లక్షల రైతులకు రూ.35.27 కోట్ల లబ్ధి

» జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్


లబ్ధిదారులతో కలిసి నమూనా చెక్‌ను ప్రదర్శిస్తున్న జేసీ భావనవశిష్ట్

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీగా జిల్లాలో ఒక లక్షా 73 వేల మంది రైతులకు రూ.35.27 కోట్లు లబ్ధి చేకూరిందని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్ అన్నారు. ఐదో విడత వైఎస్ఆర్ రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సీఎం జగన్ తాడేపల్లి సీఎం కార్యాలయం నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమ చేశారు.ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో లక్షా 71 వేల 215 మంది రైతులకు రైతుభరోసాగా రూ.34 కోట్ల 83 లక్షలు, 2,133 మంది రైతులకు సున్నా వడ్డీగా రూ.43 లక్షల 78 వేలు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. లబ్ధిదారులైన రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యాన వనాధికారి రమేశ్‌కుమార్ రావు, ఏడీ శ్రీనివాస్, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.


సీలేరు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు

... 5వ పేజీ తరువాయి

సమీక్షించి, స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు అక్కడ పర్యటించారు. జెన్‌కో పరిధిలో ఉన్న స్థలాలను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ అనుమతులు వచ్చిన వెంటనే పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎస్ఈలు కేకేవీ ప్రశాంత్ కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ ప్రభాకర్, ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం

... 5వ పేజీ తరువాయి


అరకులో మహిళలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి... (ఇన్‌సెట్‌లో) బాలుడికి చాక్లెట్ ఇస్తున్న దృశ్యం

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తనను చూసేందుకు వచ్చిన గ్రామంలోని మహిళలను ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు.

ప్రకృతి అందాలకు ఫిదా

అరకులోయ నుంచి మునిసిరిగుడ వెళ్లే లోతేరు రహదారిలో ప్రకృతి అందాలను చూసి ఆమె పరవశించిపోయారు. ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న అరకు గోల్డ్ కాఫీ పాయింట్ వద్ద ఆగి అరకు కాఫీ రుచి చూశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏజెన్సీలో రూ.5.30 కోట్లతో పెద్ద ఎత్తున కాఫీ తోటలు వేయించి గిరిజన రైతులను ప్రోత్సహించారని భువనేశ్వరికి అరకు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దొన్నుదొర వివరించారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకంగా కనీస అభివృద్ధి జరగలేదని, అరకును పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

చేతి వృత్తుల వారసత్వాన్ని సంరక్షించుకుందాం

» ఐటీడీఏ పీవో వి.అభిషేక్


విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్, ఫిబ్రవరి 28: సంప్రదాయ చేతి వృత్తులకు సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సూక్ష్మ, చిన్న మధ్యతరగతి ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సంప్రదాయ చేతి వృత్తుల వారు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సరైన శిక్షణ లేక చేతి వృత్తుల వారు వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి శిక్షణ అందించి ప్రస్తుత అవసరాలకు తగినట్టు వస్తువులు తయారు చేయడం, వాటికి సరైన మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేయడమే పీఎం విశ్వకర్మ పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, స్వర్ణకారులు, తాపీ, మంగలి, చాకలి, టైలరింగ్ తదితర 18 రకాల సంప్రదాయ వృత్తులలో నిమగ్నమైన వారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. చేతి వృత్తుల వారికి శిక్షణ అందించి మొదటి దశలో రూ.లక్ష, రెండో దశలో రూ.2 లక్షలు స్వల్ప వడ్డీకి రుణాలు అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ సమయంలో స్టైఫండ్‌తో పాటు టూల్ కిట్‌లు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని 18 ఏళ్లు నిండిన ఆసక్తి గల చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ పథకంలో ఇప్పటి వరకు జిల్లాలో 9,300 మంది పేర్లు నమోదు చేసుకోగా, పాడేరు డివిజన్ పరిధిలో 5,500 మంది ఉన్నారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా అత్యధిక మంది నమోదు చేసుకొనే విధంగా చైతన్యపర్చాలని ఆయన సూచించారు. సదస్సులో ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకులు డీవీఎస్ఆర్.మూర్తి, ప్రతినిధి వి.నాగకుమార్, జిల్లా పరిశ్రమ కేంద్రం జీఎం శ్రీవాణిధర్ రామన్, ఏడీ ఎం.నవీన్‌కుమార్, డీఆర్డీఏ పీవో వి.మురళి, డీఎల్‌పీవో పీఎస్‌కుమార్ పాల్గొన్నారు.


హుకుంపేటలో నిర్మించిన గిడ్డంగిని పరిశీలిస్తున్న పీవో అభిషేక్

రైతులు అధిక దిగుబడులు సాధించాలి

హుకుంపేట: ప్రభుత్వ ప్రోత్సాహకాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గిడ్డంగిని పరిశీలించారు. అనంతరం పీవో మాట్లాడుతూ రైతులు పండించిన దినుసులు భద్రపరుచుకుని గిట్టుబాటు ధర వచ్చినపుడు విక్రయించాలని చెప్పారు. జి.మాడుగుల మండలంలోని నూర్మతి, కొత్తూరు గ్రామలలో గొల్లోరి క్రిష్ణ అనే రైతు షెడ్డు నెట్ కింద చేస్తున్న కూరగాయలు సాగు పరిశీలించారు. ఈ సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుని మరింత ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమనికి వెలుగు ఏపీడీ మురళి, అధికారులు ప్రసాద్, సింహచలం, కళావతి తదితరులు పాల్గొన్నారు

ఆదివాసీల అభ్యున్నతికి కృషి: ఏఎస్పీ ధీరజ్



వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏఎస్పీ

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 28: ఆదివాసీల అభ్యున్నతికి పోలీస్ శాఖ తమ వంతు కృషి చేస్తున్నదని ఏఎస్పీ ధీరజ్ అన్నారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో బుధవారం యువహో వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో ఏడు పంచాయతీలకు చెందిన సుమారు 40 జట్లు పాల్గొన్నాయి. హోరా హోరీగా జరిగిన పోటీల్లో బూసిపుట్టు జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. అలాగే ద్వితీయ స్థానంలో కోడాపుట్టు, తృతీయ స్థానంలో సేబుగూడ జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతులతో పాటు ఏఎస్పీ చేతుల మీదుగా నగదును అందించారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లుకు వాలీబాల్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లరాదని సూచించారు. ప్రధానంగా గంజాయి సాగును చేయరాదన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించిన, ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. గంజాయి, సారా వంటి మత్తు పదార్థాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వాటికి ఎంత దూరంగా ఉంటే జీవితాలు అంత బాగుంటాయని ఆయన తెలిపారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. రాయితీపై రుణాలు కావాలంటే తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. అలాగే లక్ష్మీపురం వైపు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే ఎటువంటి సమస్యలు ఉన్నా లిఖిత పూర్వకంగా తనకు అందిస్తే, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్.రమేష్, సర్పంచ్ కె.త్రినాథ్, ముంచంగిపుట్టు ఎస్ఐ కె.రవీంద్ర, పెదబయలు ఎస్ఐ పి.మనోజ్, ఏఎస్ఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పాడేరు రూరల్/చింతపల్లి/కొయ్యూరు/సీలేరు, ఫిబ్రవరి 28: మన్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి మాట్లాడుతూ .యువత విజ్ఞాన శాస్త్రంలోని మనుగడను సాధించేందుకు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విజ్ఞాన శాస్త్రం మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.విద్యార్థులు ప్రతీ శాస్త్రంలో ప్రాథమిక అంశాలను తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు సిహెచ్.జగదీశ్వరరావు, ఎస్.కోట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ టీఎన్.రసూల్, అధ్యాపకులు పాల్గొన్నారు.


పాడేరు కళాశాలలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు

చింతపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీసీవోఎస్‌టీ ప్రతినిధులు విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు పలు ప్రయోగాలను ప్రదర్శించారు. ఉమెన్ సేఫ్టీ బ్యాగ్ ప్రయోగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గోపీనాథ్ మాట్లాడుతూ మానవుల నిత్య జీవితంలో సైన్స్ ముడిపడి వుంటుందన్నారు. ప్రతి విద్యార్థినీ, విద్యార్థి వినూత్నంగా ఆలోచించాలన్నారు. విద్యాభ్యాసంతో పాటు ప్రయోగాలు చేపడడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఊలం వీరభద్రరావు, సైన్స్ జిల్లా సమన్వయకర్త పి.రమణమూర్తినాయుడు, సైన్స్ ఉపాధ్యాయులు జి.దాసు, కేఎస్ఎన్ కుమారి, జి.నాగేశ్వరరావు, కె.మోహన్‌రావు పాల్గొన్నారు.


చింతపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొయ్యూరు: కొయ్యూరు కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ హరూన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు మాట్లాడుతూ విజ్ఞానాన్ని మంచి కోసమే ఉపయోగించాలన్నారు. ప్రతీ విద్యార్థి ప్రయోగాలు చేస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.మహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు డీఏవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డి.నమశ్శివాయ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిత్య జీవితంలో సైన్స్ వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకరరావు, ఏడీఈ వెంకటమధు, , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీరేదెన్నడో?

... 5వ పేజీ తరువాయి

పొలాల గట్లపై నడిచి వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తున్నది.

ఎండా కాలం, వర్షాకాలం నీటికి కటకట

ఎండా కాలం, వర్షాకాలం చినఅగ్రహారం ఆదివాసీలు నీటి కోసం కటకటలాడిపోతున్నారు. ఎండా కాలం ఊటగెడ్డ ఎండిపోతుంది. దీంతో రెండున్నర కిలోమీటర్ల దూరంలోనున్న పొరుగు గ్రామానికి వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తున్నది. వర్షాకాలం చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఊటగెడ్డ వద్ద నీళ్ల బురదగా మారిపోతున్నాయి. వర్షం తగ్గిన తరువాత కొన్ని గంటల పాటు నిరీక్షిస్తే తప్ప ఊటగెడ్డలోని నీళ్ల వినియోగానికి ఉపయోగపడడంలేదు.

వైసీపీ నాయకులను అడ్డుకుంటాం



వైసీపీ నాయకులు రానున్న ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు గ్రామానికి వస్తే అడ్డుకుంటాం. ఐదేళ్లగా రక్షిత మంచి నీటి పథకం నిర్మిస్తామని వైసీపీ నాయకులు చెబుతున్నప్పటికి ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. కలుషిత నీరు తాగడం వల్ల సీజనల్ వ్యాధులకు గురవుతున్నాం. మంచి నీటి పథకం నిర్మించే పార్టీకే ఓటు వేస్తాం.

-వంతల దాలమ్మ, చినఅగ్రహారం


అరకు పాఠశాల ప్రాంగణంలో వసతిగృహ భవనాన్ని పరిశీలిస్తున్న ఈఈ

పది రోజుల్లో అందుబాటులోకి డిగ్రీ కళాశాల భవనం

అరకులోయ, ఫిబ్రవరి 28: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నూతన భవనం పది రోజుల్లో అందుబాటులోకి వస్తుందని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ ఎ.కుమార్ తెలిపారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాల, వసతిగృహం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాల పక్కనే నిర్మాణం పూర్తయిన నూతన వసతిగృహ భవనం పనులను డీఈఈ సన్యాసయ్య, కాంట్రాక్టర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేకంగా వసతి గృహం భవనం మంజూరు చేసిందన్నారు. ఈ భవనాన్ని రూ.1.94 కోట్లతో నిర్మించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజ సంక్షేమ శాఖ డీఈఈ సన్యాసయ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

... 5వ పేజీ తరువాయి

గిరిజనుల్ని ఆమె కొనియాడారు. వైసీపీ ప్రభుత్వం ఆఖరికి శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై సైతం అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేశారని, మహిళలను సైతం అర్ధరాత్రి వరకు స్టేషన్లలో ఉంచి కర్కశంగా వ్యవహరించారని ఆమె ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, టీడీపీ నేతలు కోడా వెంకట సురేశ్‌కుమార్, దప్పోడి వెంకటరమణ, మాజీ మంత్రి మణికుమారి, కొట్టగుళ్లి సుబ్బారావు, జి.శివకుమార్, జి.సింహాచలం, రొబ్బి రాము, జ్యోతికిరణ్, పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణరాజు, టి.సత్యనారాయణ, అధిక సంఖ్యలో గిరిజన మహిళలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


టీడీపీ కార్యకర్త నాగేశ్వరరావు ఇచ్చిన అడ్డాకుల టోపీని ధరించిన భువనేశ్వరి

సంక్షిప్తంగా..

తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈఈగా సురేశ్‌కుమార్


జి.సురేశ్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.సురేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఈగా పని చేసిన అప్పారావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో శ్రీకాకుళంలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న జిసురేశ్‌కుమార్‌కు ఈఈగా పదోన్నతి కల్పించి నియమించారు. బుధవారం ఈఈగా బాధ్యతలు చేపట్టిన సురేశ్‌కుమార్‌కు డీఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

సింహగర్జనకు ఉద్యోగులు తరలిరావాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

చింతపల్లి, ఫిబ్రవరి 28: కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, దినసరి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్న డిమాండ్‌తో విశాఖలో మార్చి 3న నిర్వహించే సింహగర్జనకు తరలిరావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, దినసరి ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఎన్నికల ముందు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చిన జగన్, ఐదేళ్ల కాలంలో ఏనాడూ ఈ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ హామీ నెరవేర్చకపోవడం వల్ల రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా హామీ నెరవేర్చాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శేషు, పద్మ, పావని పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులు పరిష్కరించండి

చింతపల్లి, ఫిబ్రవరి 28: ఓటరు దరఖాస్తులను బీఎల్‌వోలు సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ సిహెచ్.రాధాకృష్ణమూర్తి ఆదేశించారు. బుధవారం బీఎల్‌వోలు, సెక్టోరియల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా వస్తున్న ఫారం-6, 7, 8లను బీఎల్‌వోలు డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత వ్యక్తి గృహానికి, గ్రామానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించాలన్నారు. ఓటు హక్కు పొందేందుకు అర్హుడా? కాదా? అని ధ్రువీకరించుకుని రెవెన్యూ కార్యాలయానికి సమర్పించాలన్నారు. చిరునామా మార్పు, పేర్లు నవీకరణలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ బూత్ పేర్ల మార్పులు, చేర్పులను పరిశీలించి సరిచేయాలన్నారు. సదుపాయాలను గుర్తించి నివేదిక అందిస్తే ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఉప తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరు: బీజేపీ నేత కృష్ణారావు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 28: వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ ప్రజాపోరు యాత్ర-2 ప్రారంభించిందని పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కూడా కృష్ణారావు అన్నారు. మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మల్లికార్జున, చీడిగొంది, పెద్దపాడు, నక్కబంద గ్రామాల్లో బుధవారం ప్రజాపోరు యాత్ర-2 కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు నెరవేర్చడంలో జగన్ విఫలమయ్యారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గిరిజనులకు 15 రకాల పథకాలను రద్దు చేసిందన్నారు. ఆర్థిక సంఘం నిధులను సైతం దారిమళ్లించి పంచాయతీ ఖజానా ఖాళీ చేసిన ఘనత జగన్‌దేనన్నారు. వైసీపీ మోసాలను ప్రజలు గుర్తించాలని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకూరి శేఖర్, పండ ఈశ్వరరావు, పి.శ్రీను, జి.త్రినాథ్, మొట్టడం లక్ష్మణరావు, మత్స్యరాస రామ్ కిరణ్ పాల్గొన్నారు.

బ్యాంకు కార్యకలాపాలు తెలుసుకోండి

» లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ రవితేజ

హుకుంపేట, ఫిబ్రవరి 28: బ్యాంకింగ్ కార్యకలాపాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని బ్యాంకు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్.రవితేజ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల బుధవారం ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే బ్యాంకు ప్రయోజనాలు, డిజిటల్ బ్యాంకు లావాదేవీలు, పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్లు గోపి రాజేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మశ్రీ నన్ను కొట్టారు

... 5వ పేజీ తరువాయి

సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఇంతలో ధర్మశ్రీ అనుకూల వర్గమైన జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో పలువురు లోపలికివచ్చి పెదపూడి సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎం పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావుపై దాడి చేసి కొట్టారన్నారు. దీంతో తీవ్ర అసహనం చెందిన ఆడారి ఆనంద్‌కుమార్.. అందరినీ బయటకు వెళ్లిపోవాలని ఆదేశించడంతో వెలుపలికి వచ్చామన్నారు. తరువాత దొండా రాంబాబు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు తనను అసభ్య పదజాలంతో దూషించారని ఆయన చెప్పారు. తాను కూడా దూషించడంతో ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంతవరకు ఎవరితోనూ ఒక్క మాట పడలేదని, అలాంటిది ఎమ్మెల్యే ధర్మశ్రీ తనపై చెయ్యి చేసుకోవడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని సన్యాసిరావు అన్నారు. ఇందుకు నిరసనగా వడ్డాది పీఏసీఎస్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధిష్టానం చోడవరం టికెట్‌ను ధర్మశ్రీకి కేటాయిస్తే.. ఆయనకు మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. మండలంలో ధర్మశ్రీ తీరును వ్యతిరేకించే వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, రాజకీయంగా తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా పీఏసీఎస్ చైర్‌పర్సన్ సన్యాసిరావుపై ఎమ్మెల్యే ధర్మశ్రీ చెయ్యి చేసుకోవడానికి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ దొండా కన్నబాబు, వడ్డాది ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి భర్త సూరి అప్పారావు, పంచాయతీ వార్డు మెంబర్ దొండా నరేశ్, నాయకులు సయ్యపురెడ్డి నవీన్, అడపా నరసింహమూర్తి తదితరులు ఖండించారు. సమావేశంలో దొండా అచ్చియ్యదొర, దొండా శ్రీను, శిరిగిరిశెట్టి చిన వెంకయ్యదొర, దొండా కుమార్, అదప్రావు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.